




*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అలరాచ పుట్టిళ్ళు

**క్లాస్ ముగించి బయటకి** వచ్చిన శ్రీకర్ జేబులోంచి ఫోన్ తీసి ఆన్ చేసాడు. అతను కారు వైపు నడుస్తూండగా ఫోన్ మోగింది. ఏదో నంబర్‌నించి. ఓ క్షణం తటపటాయించి దాన్ని ఆన్సర్ చేసాడు.

"హలో కర్రబాబూ నువ్వేనా?" అవతలి నించి వినిపించింది.

చిరపరిచితమైన కంఠం. ఓ విధమైన యాసతో పెద్దగా అడుగుతున్నాడు.

"ప్రసాదం మామా!" శ్రీకర్ కూడా అప్రయత్నంగా అరిచాడు.

"అమ్మయ్య. నువ్వే. గణేష్‌గాడు నిజం నంబర్ ఇచ్చాడా? లేదో అని అనుమానిస్తా చేసా" ప్రసాదం ఆనందంగా చెప్పాడు.

"ఎంతకాలమైంది మామా. ఎలా ఉన్నారంతా?" శ్రీకర్ ఉత్సాహంగా అడిగాడు.

"ఎంతకాలమైనా నేను నీకు ఫోన్ చేసాకాని నువ్వు చేయలేదుగా" ప్రసాదం కంఠంలో విషాదం.

శ్రీకర్ తడబడుతూ చెప్పాడు.

"నిజమే మామా. తప్పు నాదే."

"తప్పొప్పులెందుకులేరా. ఓసారి మనూరు రావచ్చుగా? అమ్మమ్మ పోయాక ఎవరూ ఇటువైపు తొంగి చూడలేదు. తాత, అమ్మమ్మలతో పాటు ప్రసాదం కూడా పోయాడనుకుంటున్నారా?"

"నిష్ఠూరాలు వద్దులే మామా. తప్పకుండా వస్తాను. ఇది నీ నంబరేనా? టచ్‌లో ఉందాం. సెలవుల్లో వస్తాను" శ్రీకర్ కాల్ కట్ చేసాడు.

శ్రీకర్‌కి ఉద్విగ్నంగా అనిపించింది. చిన్నప్పుడు అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్ళినప్పుడు సైకిల్ ఎక్కించుకుని ఊరంతా తిప్పిన ప్రసాదం మామ గుర్తొచ్చాడు. గోలీలు, ఈతలు, చెట్లెక్కడం అన్నీ నేర్పించిన మామ తన కోసం నవ్వుతూ తిట్లు తినేవాడు.

ఇంటికి వెళ్ళాక ఎదురొచ్చిన తల్లితో చెప్పాడు.

"అమ్మా. ప్రసాదం మామ ఫోన్ చేసాడు."

పద్మిని మొహం అప్రసన్నంగా మారింది.

"నీ నంబర్ ఎలా దొరికిందిట?" అడిగింది.

"గణేష్ ఇచ్చాడట."

"వాడొకడు పెద్ద డాక్టరైనా బుద్ధీ, జ్ఞానంలేవు."

శ్రీకర్ తల్లి మొహంలోకి తేరిపార చూసి అడిగాడు.

"సొంత తమ్ముడైనా నీకు మామ మీద ఎందుకమ్మా అంత కోపం?"

"తమ్ముడు! మరే సొంత తమ్ముడు. పుట్టిల్లు లేకుండా చేసాడు" పద్మిని రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది.

ఆ గొడవలన్నీ శ్రీకర్‌కి తెలుసు. అమ్మమ్మ పోయాక ఆవిడ ఒంటిమీది బంగారం తమకే రావాలని అమ్మ, పెద్దమ్మ గొడవచేయడం, ఇచ్చేది లేదని ప్రసాదం కరాఖండీగా చెప్పడం, పదోరోజు కార్యక్రమానికి ఉండకుండా అక్కచెల్లెళ్ళు ఇద్దరూ బయలుదేరడం ఇరవై ఏళ్ళ శ్రీకర్‌ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అప్పటికీ తల్లికి నచ్చచెప్పే ప్రయత్నం చేసాడు.

"అమ్మా. పెదనాన్న పెద్ద డాక్టర్. నాన్న సీనియర్ ఇంజనీర్. ఆ బంగారం మీరు కొనుక్కోలేరా? ఎందుకు గొడవలు? పాపం మామకి ఉద్యోగం లేదు. వ్యవసాయమే. ఆ బంగారాన్ని అత్తకి వదిలేస్తే ఏమవుతుంది"

"నువ్వు నోర్ముయ్. అమ్మ బంగారం కూతుళ్ళకే రావాలి" పద్మిని అతన్ని నోరెత్తనివ్వలేదు.

ఆ తర్వాత వాళ్ళు ఆ ఊరికి వెళ్ళలేదు. అమ్మమ్మ సంవత్సరీకాలకి రమ్మని ప్రసాదం ఫోన్ చేసి ప్రాధేయపడడం, పద్మిని తిరస్కరించడం నిస్సహాయంగా గమనించాడు. లేండ్‌లైన్ ఫోన్స్ పోయి సెల్‌ఫోన్స్ వచ్చాక నంబర్లు తెలీక ప్రసాదం నించి ఫోన్లు ఆగిపోయాయి.

"అమ్మా దసరా సెలవులకి ఆంధ్రా వెళ్దామనుకుంటున్నాను. ప్రసాదం మామ ఇంటికి."

"ప్రసాదం మామ ఇల్లేంకాదు అది. తాతయ్యది. కొడుకో కొడుకో అని గారాం చేసి చదువు సంధ్య లేకుండా చేసారు. ఆడపిల్లల్ని అన్యాయం చేసి అంతా వాడికి దోచి పెట్టారు. ఐనా నువ్వెందుకు వెళ్తున్నావు? నాకు లేని చుట్టరికం నీకెందుకు?" పద్మిని అరిచింది.

"నాకు మీ ఆస్తి గొడవలు వద్దమ్మా. మామకి నాకు ఆర్ధిక సంబంధాలు లేవు. ఫ్రెండ్ షిప్ అంతే" శ్రీకర్ స్థిరంగా చెప్పాడు.

"పోపో. ఇన్నేళ్ళ తర్వాత ఫోన్ చేసాడంటే వాడి కడుపులో ఏదో ఆలోచన ఉండే వుంటుంది. వాడి కూతుర్ని నీకిచ్చి చేద్దాం అనుకుంటున్నాడేమో! అమ్మా నాన్నదే కాక అక్కా బావది కూడా వస్తుందిగా."

"ఛ! ఛ!" శ్రీకర్ మాట్లాడొద్దన్నట్లుగా తల్లి చెయ్యి పట్టుకున్నాడు.

"మామ కూతురు ఎంత చిన్న పిల్లమ్మా? పదిహేనేళ్ళుంటాయేమో! నాకు ముప్పై ఐదు. ఏమ్మాట్లాడుతున్నావ్? సొంత తమ్ముడి మీదే అంత కక్షా?"

"కాలం కాని కాలంలో కాసిన కుక్క మూతి పిందెవాడు. నేనైతే వెళ్ళొద్దని చెప్తాను. నువ్వు వినవు కాబట్టి వెళ్తావు" పద్మిని విసురుగా వెళ్ళిపోయింది.

భార్గవి, పద్మిని తల్లితండ్రులకి ప్రసాదం పుట్టేనాటికి భార్గవికి ఇరవై రెండేళ్ళు. అప్పటికే ఆమెకి పెళ్ళయి గణేష్ పుట్టాడు. ఇరవై ఏళ్ళ పద్మినికి ఆ చిన్న తమ్ముడ్ని చూస్తే సిగ్గుగా, అవమానంగా ఉండేది. మనవడు పుట్టాక కొడుకుని కనడం ఏమిటని అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ ఉత్తరాల్లో తిట్టుకునేవాళ్ళు. పెద్ద కూతురికి డాక్టర్ సంబంధం చేసిన తండ్రి పద్మినికి ఓ ఎన్ జి సిలో పనిచేస్తున్న కెమికల్ ఇంజనీర్‌తో పెళ్ళి చేసాడు. పద్మిని దిబ్రూగఢ్ వెళ్ళిపోయింది. కూతుళ్ళకి మంచి సంబంధాలు చేసి, పెట్టుపోతలు ఘనంగా పెట్టిన ఆయన కొడుకుని మాత్రం చదివించలేకపోయాడు. ప్రసాదం బి.కామ్ చదివాడు. చదువు అవగానే తనకి పెళ్ళి చేయమని గొడవచేసి రుక్మిణిని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళికి వచ్చిన తమకి సరిగ్గా మర్యాదలు జరగలేదని అక్కచెల్లెళ్ళు అలిగారు. తల్లి బతిమాలడంతో పెళ్ళయ్యేదాకా ఉండి వెళ్ళిపోయారు. తర్వాత ప్రసాదం ఆస్తంతా నాశనం చేసి ఐదు ఎకరాలు మాత్రమే మిగిల్చాడని, ఉద్యోగంకి వెళ్ళకుండా ఊళ్ళోనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడని వాళ్ళకి కోపంగా ఉండేది. తల్లితండ్రుల మరణం తర్వాత ప్రసాదంని బాయ్‌కాట్ చేయాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు.

అస్సాం నించి మూడు విమానాలు మారి శ్రీకర్ రాజమండ్రి చేరేసరికి సాయంత్రం ఆరైంది.

"ఒరేయ్ కర్రబాబూ ఇటు" ప్రసాదం గొంతు పెద్దగా వినిపించింది.

అటువైపు నడిచిన శ్రీకర్‌ని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు. అతని కళ్ళు తడిసాయి.

"ఏంటోరా. అందరూ వుండి అనాథగాడినైపోయాను. ఎవరికీ నా ఊసు పట్టదు. మీ అమ్మ అక్కడెక్కడో అస్సాంలో ఉంది కాబట్టి కనపడదు. పెద్దక్క చుట్టాల పెళ్ళిళ్ళూ పేరంటాల్లో కలుస్తుంది కాని నాతోకాని రుక్కుతో కాని మాట్లాడదు. అంత అపరాధం ఏం చేసానో?"

"పోన్లే మామా గణేష్, నేను నీతో బానే ఉన్నాంగా" శ్రీకర్ సముదాయించాడు.

"బైక్ మీద కూర్చోగలవా?" ప్రసాదం అడిగాడు.

"నువ్వు నడిపితే సైకిలైనా పర్లేదు" శ్రీకర్ నవ్వాడు.

చీకటి పడే సమయానికి ఇంటికి చేరుకున్నారు. బయటకి ఇల్లు పాతగా ఉన్నా లోపల కొంత ఆధునీకరించారు.

"ఎలా ఉన్నావ్ శ్రీకర్? అమ్మా నాన్న బావున్నారా?" రుక్మిణి పలకరించింది.

"బావున్నారత్తా. నువ్వెలా ఉన్నావు?" శ్రీకర్ ఆమె చేతిలోని మంచినీళ్ళ గ్లాస్ అందుకుంటూ కుశల ప్రశ్నలు వేసాడు.

తల్లి వెనకే నిబలడ్డ  పిల్లలిద్దర్ని అతనికి చూపిస్తూ చెప్పాడు ప్రసాదం.

"ఇదిగో కర్రబాబు. ఇది నా కూతురు టెంత్ క్లాస్. ఊళ్ళో అంతా మీ అమ్మ పోలికే అంటారు. వాడు వంశోద్ధారకుడు ఎయిత్."

పిల్లలిద్దరూ నవ్వారు.

"నాన్నా! బావని కర్రబాబు అంటావేంటీ?" అబ్బాయ్ అడిగాడు. ప్రసాదం పెద్దగా నవ్వాడు.

"వీడు చిన్నప్పుడు సన్నగా దారంలాగా ఉండేవాడు. వీడిపేరు శ్రీకర్ కదా. అందుకని కర్రబాబని పిలవడం అలవాటైంది" చెప్పాడు.

ప్రసాదం పరిస్థితి పద్మిని చెప్పినంత ఘోరంగా లేదని శ్రీకర్ గ్రహించాడు. అంతా ఆరోగ్యంగా పుష్టిగా ఉన్నారు. ఇల్లు కూడా ఏ లోటూ లేకుండా ఉంది.

"ఏం చేస్తున్నావ్ మామా? ఆ రోజుల్లో డిగ్రీకి ఉద్యోగాలు వచ్చేవి కదా? ఎందుకు ట్రై చేయలేదు?" ఆ రాత్రి అడిగాడు.

"నేను వడ్లు మారుబేరం వ్యాపారం చేస్తున్నారా. ఉన్న ఊరు. అంతా తెలిసిన వాళ్ళు. వచ్చేది సరిపోతుంది. ఏ రాజమండ్రో వెళ్ళి కాపురం పెట్టాలని లేదు" ప్రసాదం చెప్పాడు.

ఇద్దరూ డాబా మీద మంచాలేసుకుని పడుకున్నారు. కొద్దిసేపయ్యాక ప్రసాదం అడిగాడు.

"శ్రీకర్ ఓ మాట అడుగుతా ఏమీ అనుకోవుగా?"

"శ్రీకర్ అన్నావంటే ఏదో సీరియస్ విషయమే. నా గురించైతే అడుగు. మీ అక్క గురించి మాత్రం నేనేం చెప్పలేను" శ్రీకర్ లేచి కూర్చుని చెప్పాడు.

"నువ్వింకా పెళ్ళెందుకు చేసుకోలేదురా? మా నాన్న చేసిన తప్పే చేస్తున్నావుగా? పిల్లల్ని ఎప్పుడు కంటావు? నలభైల్లోనా?" ప్రసాదం కంఠం బరువుగా ధ్వనించింది.

"మీ నాన్నలాగానా?"

"అవును. నేను మా అమ్మ కడుపులో పడ్డప్పుడు అమ్మకి నలభై రెండు, నాన్నకి ఏభై. ఈ రోజుల్లో అది చిన్న వయసేమో  కాని ఆ రోజుల్లో కాదు. పెద్దక్క పెళ్ళప్పుడు అమ్మకి ముప్పై ఎనిమిదేళ్ళు అనుకుంటా. లేదా ముప్పై ఆరో. ఆ తర్వాత అమ్మ జడలేసుకున్నా సిల్క్ చీరలు కట్టుకున్నా ఊళ్ళోవాళ్ళు ఆక్షేపించేవాళ్ళట. ముడిపెట్టుకుని జరి అంచు కాటన్ చీరలు కట్టాలన్నమాట. ఆ వయసులో తమ్ముడు పుట్టడం మా అక్కలు జీర్ణించుకోలేకపోయారు. వాళ్ళకది ఎంతో అవమానంగా అనిపించింది" ప్రసాదం ఆగి తలకింద చేతులు పెట్టుకుని ఆకాశంలోకి చూస్తూ కొనసాగించాడు.

"నాక్కూడా అలాగే ఉండేది. గణేష్ వాళ్లమ్మ, అదే పెద్దక్క ఫేషనబుల్‌గా అలంకరించుకుని నైలాన్ చీరలు కట్టుకునేది. మా అమ్మ కూతురికి, అల్లుడికి చాకిరి చేస్తూ చెమటలు కారుతూ వంటింట్లో ఉండేది. మా నాన్న ఫీజ్ కట్టడానికి స్కూల్‌కి వచ్చినప్పుడు మా ఫ్రెండ్స్ 'మీ తాతా?' అని అడిగేవాళ్ళు. అప్పట్లో ఉక్రోషంగా ఉండేది చిన్న వయసు కదూ."

"మామా ఇంత తెలివిగా మాట్లాడుతున్నావు. మరి చదువు..." శ్రీకర్ ఆగిపోయాడు.

"చదువులో కూడా తెలివైన వాడినే. ఇంటర్ ఎగ్జామ్స్ రాయగానే మా ఫ్రెండ్స్‌తో పాటు గుంటూరు వెళ్ళి ఎంసెట్ కోచింగ్‌లో చేరతానని చెప్పా. అప్పుడే మా నాన్న కొన్ని నిజాలు చెప్పాడు..." ప్రసాదం కళ్ళు నీళ్ళతో నిండి ఆ వెన్నెల్లో తళతళ మెరిసాయి.

"ఇద్దరు కూతుళ్ళకి స్థాయికి మించిన సంబంధాలు చేసి, మర్యాదలు, పెట్టుపోతలు లాంటివాటితో మా పొలాలన్నీ తాకట్టులో ఉన్నాయి. ఏడాదికోసారి మా అక్కలిద్దరూ వచ్చి రాచమర్యాదలు చేయించుకుని వెళ్ళేవారు. వచ్చే ఆదాయం ఇలాంటివాటికే సరిపోయేది. నాన్న నన్ను ఇంజనీరింగ్ చదివించలేనని చెప్పాడు. పరిస్థితులు అర్ధమయ్యాక ఇంకేం మంకు పట్టు పడతాం? మా ఊరి జమిందారుగారి పుణ్యమా అని ఇక్కడే డిగ్రి కాలేజ్ ఉంది. అందులో బికాంలో చేరిపోయా. 'ఇంటర్‌లో నైంటీ ఫైవ్ పర్సట్ వచ్చి కూడా బికామ్ ఏమిటి? ఈ రోజుల్లో ఆడపిల్లలు కూడా చదవట్లేద'ని మా ప్రిన్సిపాల్ ఆశ్చర్యపోయాడు. కొడుక్కి అన్యాయం చేసామనే దిగులుతో అమ్మానాన్న కృంగిపోయారు. నిజానికి వాళ్ళు కొడుకు కావాలని నన్ను కనలేదు. పొరపాటున కడుపులో పడ్డా అంతే, కాని ప్రేమ ఉంటుందిగా. ఆ తర్వాత అక్కలు వచ్చినప్పుడు 'అమ్మకి సాయం చేయచ్చుగా' అని గొడవపడేవాడిని.

'మా ఇళ్ళల్లో చేసి చేసి వచ్చాం. పుట్టింట్లో రెస్ట్ తీసుకోవద్దా?' అని వాళ్ళు అనేవాళ్ళు. అమ్మ నన్నే నోరు మూయమనేది. అందుకే డిగ్రీ అవగానే పెళ్ళి చేసుకుని రుక్కుని ఇంటికి తెచ్చాను. తను అమ్మని వంటింట్లోకి రానివ్వకుండా చూసుకునేది. ఉన్న పొలాల్లో ఐదెకరాలు ఉంచుకుని మిగిలినవి అమ్మేసి తాకట్టు తీర్చి ఋణ విముక్తులం అయ్యాం. 'ఆడపిల్లలకి ఆస్తిలో భాగం ఉందని, తమకి అన్యాయం చేసామని' అక్కలిద్దరూ వచ్చి గొడవచేసారు. నేను పట్టించుకోలేదు."

"మరి అమ్మమ్మ బంగారం?" శ్రీకర్ అడిగాడు.

ప్రసాదం లేచి కూర్చుని శ్రీకర్ చేతులు తన చేతుల్లోకి తీసుకుని చెప్పాడు.

"ఈ విషయం మరెవ్వరికీ చెప్పకూడదు మరి."

"సరే." శ్రీకర్ వింతగా చూస్తూ వాగ్దానం చేసాడు.

"ఈ పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ, మర్యాదలకి మా అమ్మ బంగారంకి ఎప్పుడో రెక్కలొచ్చాయి. అల్లుళ్ళ ముందు చులకన కాకూడదని ఇత్తడి నగలు చేయించుకుంది. వాటిని తడిపేది కాదు. కూతుళ్ళు వస్తారంటే, వాటికి మెరుగులు పెట్టించేది. అవి కావాలని అక్కలు పట్టుపడితే, ఇచ్చే ప్రసక్తి లేదన్నాను. మరి అమ్మ గౌరవాన్ని నేను కూడా కాపాడాలి కదా. అలాగే నాన్న పొలాలు నాశనం చేసిన దుర్మార్గుడి అవతారం ఎత్తాను. మరి తల్లితండ్రుల గౌరవాన్ని కాపాడడానికేగా పుట్టింది!?" ప్రసాదం నవ్వాడు.

ఆ నవ్వులో శ్రీకర్‌కి గొప్ప తత్త్వవేత్త కనిపించాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments